క్లుప్తంగా

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వాణి

తోటపల్లిగూడూరు : న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సూచించారు. మండలంలోని పేడూరు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ జిల్లాలో మోడల్ విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పేడూరు గ్రామంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా, వేగవంతంగా న్యాయసేవలు పొందేందుకు ప్రభుత్వం 1987లో న్యాయ సేవాధికారి సంస్థ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, దీని ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, మహిళలకు, వృద్ధులకు ఉచిత న్యాయసేవలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్జీఓఎస్ సుబ్బారెడ్డి, కవితారెడ్డి, అడ్వకేట్ కామేశ్వరి, రోహిత్, స్థానిక తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ హేమలత, ఎంఈఓ జయరామనాయుడు, సర్పంచ్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

గమ్మళ్లపాళెంలో పశు వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారులు

తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండ పంచాయతీ గమ్మళ్లపాళెంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. స్వర్ణభారత్–మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 19 పశువులకు గర్భధారణ పరీక్షలు, 15 గేదెలకు సాధారణ చికిత్సలు అందించడంతో పాటు 25 లేగదూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. పశువుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండవ ఫౌండేషన్ వైద్యాధికారి శ్రీనివాసులునాయుడు, రిటైర్డ్ పశు వైద్యాధికారి బల్వీదీప్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక గోపాలమిత్రలు వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

- డీసీహెచ్ఎస్ రమేష్



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రమేష్

కోవూరు : ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని డీసీహెచ్ఎస్ రమేష్ తెలిపారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు సీహెచ్‌సీకి సీఎస్సార్ నిధుల నుంచి త్వరలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో సీహెచ్‌సీల అభివృద్ధికి రూ.1.80 కోట్ల నిధులు మంజూరైందని, అందుకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. అందులో కోవూరుకు రూ.40 లక్షలు, ఆత్మకూరుకు రూ.40 లక్షలు, వెంకటాచలంకు రూ.30 లక్షలు, ఉదయగిరికి రూ.15 లక్షలు, వింజమూరుకు రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే సీహెచ్‌సీలో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి పలు రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజేత, డాక్టర్ పెంచలయ్య, సలావుద్దీన్ ఉన్నారు.

కంటి అద్దాల పంపిణీ



కోవూరు : మండలంలోని పడుగుపాడు పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పైలట్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కంటి వెలుగు కింద కంటి అద్దాలను మంగళవారం పంపిణీ చేశారు. డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి చేతులమీదుగా వృద్ధులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, టీబీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీపీఓ సుస్మితారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోలాహలం.. గణనాథుల నిమజ్జనం



ముత్తుకూరు : పండ్లు, పూలతో అలంకరించిన గణపతి విగ్రహం

ముత్తుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలను మంగళవారం కూడా నిమజ్జనం చేసేందుకు సముద్రానికి తరలించారు. వల్లూరు, నారికేళపల్లి గ్రామాల నుంచి పూలమాలలతో అందంగా అలంకరించిన వాహనాల్లో వినాయకుడి విగ్రహాలను ఊరేగించారు, బాణసంచా కాలుస్తూ, యువకులు రంగులు చల్లుకొంటూ తప్పెట్ల తాళాల మధ్య విగ్రహాలను సముద్రం వద్దకు తరలించారు. దారిపొడవునా వినాయకుడి విగ్రహాలకు పూజలు చేశారు.

పండ్లు, పూలాలంకరణతో..


మండలంలోని పంటపాళెంలో వినూత్న రీతిలో అలంకరించిన గణపతి విగ్రహాన్ని మంగళవారం రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. యాపిల్, ద్రాక్ష పండ్లు, రోజా, మందారం తదితర పూలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై వినాయకుని విగ్రహాన్ని కొలువుదీర్చి, మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. తూర్పువీధి విగ్రహ కమిటీ సభ్యులు పార్లపల్లి ఖుషీనాథ్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, అంబటి హరనాథరెడ్డి, రామాయణం రితేష్‌ల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



మనుబోలు : దళితవాడలో విహరిస్తున్న వినాయకుడు

పిడూరురోడ్డులో రూ.1.20 లక్షలు పలికిన లడ్డూ

మనుబోలు : మనుబోలులోని సాయిబాబా మందిరం, దళితవాడలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జగణపయ్యలకు సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పిడూరురోడ్డులో సాయిబాబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూకు వేలం వేయగా రూ.1.20 లక్షలకు గుంజి అఖిల్ దక్కించుకున్నారు. అలాగే వినాయకుని మెడలో అలంకరించిన నగదు మాలను వేలంలో రూ.68 వేలకు పిడూరు యూత్ సభ్యులు, వెండి కాయిన్‌ను రూ.47 వేలకు రాజా, రవి దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గణనాథుని విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన డీజే, తీన్‌మార్ బ్యాండ్, డప్పు మేళాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విగ్రహాలను గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.



మనుబోలు : పిడూరురోడ్డులో వినాయకుడి గ్రామోత్సవం



ముత్తుకూరు : నిమజ్జనానికి తరలిస్తున్న గణపతి విగ్రహం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోవూరు : మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని కోవూరు సెబ్ సీఐ నరహరి తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణ, దిశా యాప్‌పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెట్నల్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ నరహరి మాట్లాడుతూ యువత సరదాల కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, అనంతరం వాటికి బానిసలుగా మారుతున్నారని తెలియజేశారు. అలా మత్తుకు బానిసలైన వారు అనేక నేరాలకు పాల్పడుతున్నారని వివరించారు. దీనవల్ల యువత మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవద్దని సూచించారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం దిశా యాప్‌ను తీసుకొచ్చిందని, దీనిని ప్రతి ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.లావణ్య, ఎండీ గయాజ్‌అహ్మద్, బి.శ్రీనివాసరావు, సెట్నల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెబ్ సీఐ నరహరి

బలవర్ధక ఆహారం తీసుకోవాలి



కొడవలూరు : తలమంచి గుంటకట్టలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల



పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మజా

పొదలకూరు : గర్భిణులు, బాలింతలు, పిల్లలు బలవర్ధక ఆహారం తీసుకోవాలని వెంకటాచలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.పద్మజా పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు, చాటగొట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతను ఎదుర్కొనేందుకు రాగులు, జొన్నలు, సజ్జలు, వేరుశనగ చిక్కీలు, ఆకుకూరలు, కోడిగుడ్లను సమపాళ్లలో తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం వీటి ద్వారా లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఆరేళ్లలోపు పిల్లల బరువు చూడాల్సిందిగా సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, కామాక్షమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ

కొడవలూరు : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సర్పంచ్ బెజవాడ లక్ష్మీబాయి సూచించారు. మండలంలోని పాతవంగల్లులో పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహారం తీసుకోవడంతో పాటు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. రక్తహీనత లాంటి సమస్యలుంటే తెలుసుకుని పరిష్కరించుకునేందుకు ఆరోగ్య పరీక్షలు దోహదపడుతాయని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.పద్మావతి, వి.వెంకటరమణమ్మ, పి.మాధవి, పి.కామేశ్వరి, విజయ పాల్గొన్నారు.

గుంటకట్టలో..

మండలంలోని తలమంచి గుంటకట్టలో పోషకాహార విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ పండంటి బిడ్డకు జన్మనివ్వాలంటే పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత గర్భిణులపై ఉందన్నారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రతి నెలా గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించి పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు జె.అనూరాధ, ఏఎన్ఎం టి.దొరసానమ్మ, పంచాయతీ కార్యదర్శి టి.సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.సుమలత, జి.శిరీష, ఎం.సౌజన్య, పి.పద్మావతి, పి.చండీప్రియ, యు.శాంతమ్మ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : వివాహిత అదృశ్యంపై బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మినగల్లుకు చెందిన మమతకు ఆత్మకూరు మండలం అగ్రవీడుకు చెందిన సురేశ్‌తో వివాహం జరిగింది. కాగా మమత బుచ్చిరెడ్డిపాళెంలో డిగ్రీ చదువుతోంది. ఈనెల 20వ తేదీ ఆమె అదృశ్యం కావడంతో బంధువులు పలుచోట్ల గాలించారు. ఎలాంటి లాభం లేకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు.

ముదివర్తిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

కోవూరు (విడవలూరు) : విడవలూరు మండలంలోని ముదివర్తి పల్లిపాళెంలో వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పడిన వివాదం నేపథ్యంలో మంగళవారం కూడా పోలీస్ పికెట్ కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై వీరాంజనేయులు తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

హైవేపై వాహన తనిఖీలు

వెంకటాచలం : వెంకటాచలం పరిధిలోని జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద సోమవారం అర్ధరాత్రి వరకు పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పలువురు మద్యం తాగి వాహనాలు నడపటాన్ని గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.

ఆస్పత్రికి వృద్ధుడి తరలింపు

ఇందుకూరుపేట : బస్‌షెల్టర్‌లో జీవనం సాగిస్తూ తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడిని సచివాలయ పోలీసులు సురేఖ, రేష్మిత, పంచాయతీ కార్యదర్శి టి.జగదీష్ మంగళవారం వైద్యశాలకు తరలించారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న బస్‌షెల్టర్‌లో అదే గ్రామానికి చెందిన నాశిన పోలయ్య అనే వృద్ధుడు కొన్నిరోజుల నుంచి తలదాచుకుంటున్నాడు. స్థానిక యువకులు ఆయనకు ప్రతిరోజు కొంత ఆహారం పెట్టేవారు. కాగా ఆయన మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ పోలీసులు 108 అంబులెన్స్ సాయంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భవిత కేంద్రం దివ్యాంగులకు వరం



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంఈఓ రమేష్‌కుమార్

మనుబోలు : భవిత కేంద్రం దివ్యాంగుల పాలిట వరమని ఎంఈఓ రమేష్‌కుమార్ అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత కేంద్రంలో ఐఆర్పీలు ఇచ్చే శిక్షణతో దివ్యాంగులు వైకల్యాల నుంచి విముక్తి పొందుతున్నారని తెలిపారు. ఫిజియో థెరపి ద్వారా వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన వెంట ఫిజియో థెరపిస్ట్ నాగరాజు, ఐఆర్పీలు శ్యామల, షర్మిల, సీఆర్ఎంటీలు చెంచు రామయ్య, స్వరూప, శ్రీనివాసులు, జయరామయ్య ఉన్నారు.

డీఎస్పీ విచారణ

ఇందుకూరుపేట : అట్రాసిటీ కేసుకు సంబంధించి డీఎస్పీ వీరాంజనేయరెడ్డి మండలంలోని గంగపట్నం గ్రామంలో మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలోని దళితవాడకు చెందిన ప్రవీణ్‌ను అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేశారని వారం రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే అదే గ్రామానికి చెందిన ఆడిపూడి రమ్యమ్మ తనను ఓ వ్యక్తి కులం పేరుతో దూషించడంతో పాటు ఇంటికి వెళ్లే దారిని అడ్డగించారని ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో డీఎస్పీ విచారణ చేపట్టారు. ఆయన వెంట సీఐ కె.రామకృష్ణారెడ్డి, ఎస్సై వీరేంద్రబాబు ఉన్నారు.

మరుపూరు హెల్త్‌క్లినిక్‌కు కేంద్ర బృందం రాక నేడు

పొదలకూరు : మండలంలోని మరుపూరు సచివాలయ పరిధిలో ఉన్న వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం ఉదయం విచ్చేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు మంగళవారం తెలిపారు. మరుపూరు హెల్త్‌క్లినిక్ సమర్థవంతంగా పనిచేస్తున్నందున మోడల్‌గా తీసుకుని కేంద్రం నుంచి ఒకరు, రాష్ట్రం, జిల్లా నుంచి ఇద్దరు అధికారులు బృందంగా వచ్చి పరిశీలిస్తారన్నారు. వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు గ్రామాల్లోని ప్రజలకు చేరువై వైద్యసేవలు అందిస్తున్న నేపథ్యంలో వాటిని ఇతర రాష్ట్రాల్లో సైతం అమలు చేసేందుకు ఈ బృందం పరిశీలించేందుకు విచ్చేస్తున్నట్లు తెలిసింది. మరుపూరుకు చెందిన వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, కో–లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రిషిత వెంట ఉండి క్లినిక్ పనితీరును వివరించనున్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం మంగళవారం కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రత్యేకపూజల్లో దేవస్థానం నిర్వాహకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాం ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి భూదేవి దేవస్థానంలో..

పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా మంగళవారం స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉభయకర్తలుగా పి.శ్రీనివాసులు–సౌజన్య దంపతులు వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా కల్యాణం జరిగింది. దేవస్థానం కమిటీ చైర్మన్ బి.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో స్వామి అమ్మవార్లు

క్లాప్‌మిత్రలకు రాష్ట్రస్థాయి పురస్కారాలు



సన్మానం అందుకుంటున్న కృష్ణయ్య



అబ్దుల్లాను సన్మానిస్తున్న అధికారులు

మనుబోలు : పారిశుద్ధ్య పనుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గానూ క్లాప్‌మిత్ర (గ్రీన్ అంబాసిడర్స్)లుగా పనిచేస్తున్న మండలానికి చెందిన సీహెచ్ కృష్ణయ్య, అబ్దుల్లా రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. అక్కంపేట గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్లా, జట్లకొండూరు పంచాయతీలో పనిచేస్తున్న సీహెచ్ కృష్ణయ్య పారిశుద్ధ్య పనుల్లో ఉత్తమ సేవలు అందించారు. దీంతో వీరికి విజయవాడలోని పీఆర్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఘనంగా సన్మానించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, పీఆర్ అండ్ ఆర్డీ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ కలిసి కృష్ణయ్య, అబ్దుల్లాకు శాలువాలు కప్పి సన్మానించారు. కాగా వీరిని ఎంపీడీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ మంగళవారం అభినందించారు.

గృహసారథులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గృహసారథులు బాధ్యతగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి మందల వెంకటశేషయ్య కోరారు. మండలంలోని సర్వేపల్లి, ఇస్కపాళెం సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. సీఎం ప్రధాన బలం గృహసారథులేనని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లిలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేయించారన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు, సైడు కాలువలు, తాగునీటి పథకాలను నిర్మించినట్లు తెలియజేశారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఇస్కపాళెం సర్పంచ్ అడపాల ఏడుకొండలు, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల దరఖాస్తుకు నేడు తుదిగడువు

కొడవలూరు : నూతన గృహ నిర్మాణాల మంజూరు కోసం నేడు తుది గడువు అని, బుధవారం సాయంత్రంలోగా దరఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గృహాలను నిర్మించుకోదలచిన వారు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతాపత్రాలను తీసుకొని మండల హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసిన వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. గృహాలు నిర్మించుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.